
**నవలానిక:**

[కులపతి అడవి బాపిరాజుగారు "జాజిమల్లి" అనునవలానికను, మా ఆంధ్ర మహిళ ద్వారా, 12 సంచికలలో, చదువరుల కందజేయనున్నారు. ఇందులకు వారికి మాకృతజ్ఞత. ॥ సం ॥]



# జాజిమల్లి

## అడివి బాపిరాజు

ఆమె జీవితంలో ఈనాడు పూవులు వికసిస్తున్నవి. వికసించే పూవులు తియ్యని వేదనతో, రాలిపోయే పువ్వులు నిట్టూర్పు పూరితమైన ఆనందంతో నిండి ఉన్నాయి.

ఆమెకు పూవుల బ్రతుకులు యిన్నాళ్లకు అర్థమయినవి. ఇంతవరకు ఆమెకు పూవుల అర్థము పూవులే! చిన్నతనాన్నించి పూవుల్ని చూస్తే కిలకిలా నవ్వుకొనేది. ఉప్పొంగుతూ గంతులు వేసేది. కాని ఆ ఆనందం ఏదో దూరాల మోసాలనుండే!

పువ్వులను చూస్తే ఆనందం పడని బాలిక ఎవరు? పువ్వులు ఆజన్మ చాలించి పూబోడులై పుడతాయో, పూబోడులే అవతారాలు చాలించి పువ్వులే అయి పుడతారో! ఆమె చిన్నతనంలో వాళ్లింటి దగ్గరవున్న నాగమల్లిచెట్టు పువ్వులు వానాకాలంలో జల్లులు జల్లులుగా రాలుతూ వున్నప్పుడు, తెల్లవారుతూనే లేచి, ఆ చిరిగిపోయిన తాటాకు బుట్టలో పోగుచేసి, ఏవేవో అర్థంకాని, అర్థానికి అతీతమైన, చిన్నబిడ్డల వెర్రిపాటలు పాడుకుంటూ పోగుజేసేది. "అమ్మా! యీయాళ ఎన్ని పువ్వులు దొరికాయో! ఏంటనుకున్నావు, ఈవేళ ఈ పువ్వులన్నీ ఎట్టి జడేసుకుంటానమ్మా! అని వాళ్ల పూరిగుడిసెలో గంతులు వేసేది.

"మల్లెలు మల్లెలు నాగామల్లెలు
తీయ తీయనీ తెల్లని మల్లెలు"

అని తాను విన్న పాట సంపూర్ణమైన యాసతో పాడుతూ ఆ బుట్టను తన హృదయానికి అదుముకొని "ఓ అమ్మా! జడ యెయ్యవంటే?" అని తల్లిని ప్రశ్నించేది.

ఇంక ఏమి పువ్వులుంటాయి ఆమె ఆ చిన్ననాటి జీవితంలో! వాళ్ల అయ్య పనిచేసే ధశరధరామి రెడ్డి పొలంలో సంక్రాంతి రోజులలో వికసించే బంతిపూవులు, బొంగడ బంతిపూవులు, సీతామ్మవారిజడ పూవులు! అవి బంగారం ముద్దలు, పొద్దు పొడపు అరుణ బిందువులూ!

రకరకాల గోంగూర పూవులు చెవుల్లో పెట్టుకొనడానికి ఎంత అందంగా వుంటాయి. అందుకనే వాటిని పూర్వకవులు కర్ణికాపుష్పాలనేవారు. గోంగూర పూవులలో ఎన్ని రంగులున్నాయి. ఎరుపు, నీలం, తెలుపు,

పసుపు పచ్చలూ, చంద్రబింబంలా విచ్చియున్న ఆ పువ్వుల హృదయంలో మధురరాగము, రాగవర్జిత విరాగహారితమై పుప్పొడులు ప్రసరిస్తూ పొలయించి వుంటుంది. దూరాన కావలికి ఆవలి చిట్టడివిలో కొండ తంగేడు పూవులూ, మోదుగ పూవులూ, వానకాలంనాటి దిరిశన పూవులూ, ఆమెకు ఎంతో ఇష్టం!

ఆమెకు తల దువ్వడానికి నూనె లేదు. వాళ్ల దొర రెడ్డిగారింట్లో యిచ్చిన నువ్వులనూనె కూర తాలింపు కోసం మాత్రంసరి పోయేది.

బిరుసైన ఉంగరాలజుట్టు, తుమ్మెద రెక్కలలా నిగ నిగ లాడుతూవున్నా, సంస్కారంలేక బాగా పెరగక, తొలకరిచిరుమబ్బుల్ని నలుదిక్కులకు ప్రసరిస్తూ ఉండేది. దొర బండ్లకు చక్రాల యిరుసులకు చుట్టిన నార తడప డానికి చిక్కని ఆముదం తెచ్చేవాడు తన అయ్య. అది నవ్వుకుంటూ చేతులకు రాసుకొని తలంతా పులుముకొనేది. తల్లి దువ్వుకొనే కర్ర దువ్వెనతో చేతులు పడిపోయేటట్లుగా దువ్వుకొని, తల్లిదగ్గరకు పరుగెత్తి జడ వేయించుకొనేది. అమ్మయ్య! అప్పుడు పెట్టుకొనేది పువ్వులు. ఆనాడు ఆ బిడ్డ "పద్ది" పల్లెవాళ్ల ఎట్టి చందనం బొమ్మ!

౨

ఈనాడు ఆమె గీతాదేవి! జాజిమల్లె పొదదగ్గర నిలుచున్నది. ఆతోట ఆమె సొంతతోట. ఆమె తోటనిండా ఎన్నిరకాల పువ్వులున్నాయ్! గేటు దగ్గిరనుంచీ ఈవలావల నాలుగు రకాల బోగైన్‌విలా పువ్వులు గుత్తులు గుత్తులై కుంకుమ, ఊదా, బంగపండు గులాబి రంగులు ప్రసరిస్తూ గాలిలో ఆడుకుంటున్నాయి. జాజి, సన్నజాజి, విరజాజి, చెట్టుమల్లె, బొడ్డుమల్లె, గుత్తులమల్లె, జంటమల్లి రేకమల్లి మొదలైన మల్లి జాతులలో అనేక రకాలైన గులాబి జాతులతో డాలియా, జినియాలు, దయాంతస్‌లు, ఈలా తన తోటంతా పువ్వులతో నింపుకుంది.

ఎంత నికృష్టమైన జన్మ తన జాతి వారిది? తమ్ము పల్లీ లంటారు. తమలో పెద్దలు కొందరు అగ్నికుల క్షత్రియులమని పిలుచుకుంటారు. అలాంటివాళ్లు యజ్ఞోపవీతాలు కూడా వేసుకుంటారు. తమ గ్రామం 'కావలి'కి నాలుగు మైళ్ల దూరములో ఉంది. అది గ్రామమేమిటి? అది పల్లె వాళ్ల చిన్న పల్లె. తన పూర్వీకులు అనాది కాలంనుంచీ సముద్రంలో పడవలు కట్టుకుపోవటం సాయంత్రానికి పడవడు చేపలతో తిరిగిరావడం, ఆ చేపలు ఎండబెట్టి ఎండు చేపల క్రింద ఎగుమతి చేయటం, లేక పచ్చి చేపలుగా ఎగుమతి చేయటమో, అలాంటి వ్యాపారము చేసి జీవితం సాగిస్తూండేవారు.

ప్రాణాలుఒడ్డి, పడవడు చేపలు పట్టుకొని వచ్చినా మధ్య వర్తుల పాళ్లన్నీ పోగా ఇంకా తమకు మిగిలేది ఏముంటుంది కనుక? అందుకని తన అయ్య దశరథ రామి రెడ్డిగార్కి పాలేరు పనిచేస్తుండేవాడు. దానా, దీనా తన పెద్ద కుటుంబం ఆకలిగీత దాటకుండా బ్రతుకుదారిలో ప్రయాణం చేస్తుండేది.

తన తాత, అవ్వ, పెద్దయ్య, అయ్య, చిన్నయ్య వాళ్లందరి బిడ్డలు తన అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు మొత్తం తమ రెండు మూడు గుడిసెల్లో తామందరూ ముప్పై ఆరుగురుండేవారు. ఏటిలో వలలువేసి చేపలు పట్టినా సముద్రంలోకి పోయి చేపలు పట్టినా ఆ పాటుఅంతా మగవాళ్లదే. తట్టలతో కావలీ, బిట్రగుంటపోయి అమ్ముకురావడం వంతు ఆడవాళ్లది.

తమ బట్టలన్ని చేపలవాసన కొట్టేవి. తమ యిండ్లచుట్టు చేపలవాసన. యిల్లంతా చేపలవాసన. చివరికి వళ్లంతా చేపల వాసనే. తమ పూర్వీకురాలైన మత్స్యగంధి చరిత్ర ఎవరు వినలేదు! ఆమె జీవితములో పరాశరుడు ప్రవేశించి ఆమెను యోజన గంధిని చేసినాడు. తన జీవితములో నరసింహామూర్తి పరాశరుడే!

గీతాదేవికి అప్పటికింకా పెండ్లికాలేదు. అప్పుడు ఆమె పద్ది. పద్దమ్మగనుక పద్దీ అని పిలిచేవారు. ఆమెకి పెండ్లి కాకపోవుటకు రెండు మూడు కారణములుండేవి. అప్పటికే ఆమెకు పదహారేండ్లు వచ్చినవి. చిన్ననాటి చింపిరి జుట్టు పోయి ఒత్తైన కాటికి కొండలాంటి జుట్టు ఆ ఉంగరాల తోనే ఆ నొక్కుల నొక్కులతోనే చీకట్లు కమ్ముకొని వచ్చింది.

ఆమెకు పదహారోఏడు వచ్చిన సంవత్సరము 1945. అంతవరకు ఆమెకు పెండ్లి కాకుండా ఉండటానికి కారణం స్పష్టంగా ఉండనే ఉన్నది. ఆ పల్లెవాళ్లలో పల్లె నాయకుడు వీరాస్వామి కొడుకు బుచ్చి వెంకన్న. అతనికి పద్దిని ఇవ్వడానికి వారిరువురి చిన్నతనంలోనే నిశ్చయం చేశారు పెద్దలు. ఉక్కు విగ్రహంలాంటి బాలుడు, సముద్రం మొసలిలాంటి శక్తివంతుడు, నల్ల మద్ది చెట్టులా కమ్మెచ్చులు తిరిగిన కండలు కట్టిన దేహంతో బార ఈతలో సముద్రములో ఎంతదూరానికైనా వెళ్లేవాడు.

బుచ్చివెంకులంటే పద్దికి ఎనిమిదో ఏటినుంచీ ప్రాణమే. నాటికే వాడు ఒక్కడూ తెరచాప ఎత్తి నావ నడుపుకు పోయేవాడు! ఎంతదూరమైనా సముద్రంలోనికే మాటలు తక్కువ. చేతకు ఎప్పుడైనా సిద్ధమే. తన పల్లెలో ఏ పని వచ్చినా, అంత చిన్నతనంలోనూ అతడు ఎన్నడూ వెనుదీయ లేదు. ఆమెకు పన్నెండు వచ్చింది. అతనికి పదహారో ఏడు వచ్చింది.అప్పుడే వీళ్ళిద్దరి పెండ్లి చేయడానికి సంకల్పించారు. పెళ్లి మూడురోజులుండనగా బుచ్చి వెంకన్న పడవ సముద్రములో మాయమై పోయింది. ఆ చుట్టు ప్రక్కల పల్లెవాడలలో పల్లె నాయకులందరూ అతని కోసం ఆ తీరమంతా గాలించారు. ఆ బాలుని కోసం పల్లెవాడలన్నీ గగ్గోలు పుట్టాయి.

పద్దమ్మ దుఃఖానికి మేరలు కనుక్కొనే వారెవరు? ఆ లేత హృదయం చితికిపోయినట్లే అయింది. వారంరోజులకి పెన్న సముద్రంలో చేరే ప్రదేశానికి తెర చాప ఎత్తుకొని కొనవూపిరితో ధైర్యంచెడకుండా వచ్చి చేరుకున్నాడు బుచ్చివెంకన్న. ఈ సంగతంతా చెప్పి కావలిలో ఉన్న ఒక అయ్యవారిని అడిగితే ఆయన బుచ్చి వెంకన్న రోజులు మంచివికావనీ, రెండేళ్ళవరకూ బుచ్చి వెంకన్నకు పద్దమ్మకూ పెండ్లి చేయవద్దని సలహాయిచ్చాడు.

పద్దమ్మకు పదిహేనోగేట బుచ్చి వెంకన్నకు పందొమ్మిదవయేట వాళ్ళిద్దరకు పల్లెపాకలలో ఎన్నడూ ఎఱుగని వేడుకలతో పెళ్లి చేశారు. కెరటమూ కెరటమూ కలసిపోయినట్లు, గావీ, గాపీ ఒరుసుకు పోయినట్లు, ఏరులో ఏరుసంగమించినట్లు, వారి జీవితాలు కలిసినవి. రెండు తిమింగిలములులా, వారు ఉప్పొంగు సముద్రాలు ఈదులాడినారు. రెండు కృష్ణ డేగలలా వారు మైమరపు ఆకాశాల తేలిపోయినారు!

ఇంతలో ప్రపంచపు బ్రతుకు మార్గాల జటల మారెమ్మ యుద్ధము, ఢాకినీదేవి అవతరించింది. జపాను యుద్ధరంగంలోకి దిగింది. భారతీయ యువకులెంతమందో కడుపు కోసం యుద్ధంలోకి జేరేరు. ఎంతమందో సరదాకోసం యూనిఫారము వేసికొన్నారు. చాలామంది ఏ సంగతి తెలియకుండా మాయమాటలునమ్మి సైన్యాల జట్టులలో జేరి పోయినారు. అలాగే యుద్ధములోకి వెళ్లిపోయినాడు బుచ్చివెంకన్న.

చేరిన ఆరు నెలలో కోహిమారంగానికి వెళ్ళవలసివచ్చింది. మరి ఆరునెలలు తిరగకుండా యుద్ధంఆగి పోయింది. టక టక సైనిక వేషములో జేబునిండా డబ్బుతో సంచులనిండా చిత్రచిత్రమైన వస్తువులతో సువాసన నూనెలతో, రంగు రంగుల సబ్బులతో, పేసుపౌడర్లతో, రిబ్బన్లతో, లోలకులతో అనేక రకాల వెన్నెలలులాంటి చీరలతో యింటికి వచ్చాడు బుచ్చివెంకట్రావు జమాదారు.

తన పల్లెలో, తనవాళ్ళతో ఉండడానికి యిష్టం లేక పోయింది. వచ్చి కావలిలో మకాము పెట్టాడు. తాను చేపల వర్తకము ప్రారంభించాడు. పెళ్ళానికీ తనకూ చదువు చెప్పటానికి ఒక మాష్టర్ని పెట్టుకున్నాడు. పెళ్ళాన్ని పద్మావతీ అని పిలిచాడు. తాను బుచ్చివెంకట్రావయినాడు కదా! పద్మావతి కంఠం ఎంత మధురమైనది? ఆమె చిన్నతనంలోనే

"ఏడుకలూ పెళ్ళి ఏడుకలూ
భూమంతా పందిరే
పువ్వుల తోరాణాలు
బూరాలు ఊదారు
ఏడుకలూ పెళ్ళి ఏడుకలూ
పడవెక్కి తెడ్లేసి
నడి సముద్రాన్ని జేరి
ఆలిచిప్పల మద్దె ముత్యాల జాలరులు
ఏడుకలూ పెళ్ళి ఏడుకల్లూ"

అని తల్లితోపాటు చేపలు ఎండవేసె టప్పుడుగాని, అయ్యయిచ్చిన చేపల్ని బుట్టలో తీసుకొనివచ్చి అమ్మకు అందిచ్చే

టప్పుడుగాని సన్నటి గొయ్యపప్పు రంగూన్ యెగుమతి కోసం తండ్రితో పోయి బుట్టలలో కట్టేసేటప్పుడు గాని వెన్నెలరాత్రులు ఒడ్డుకు తేలుకుంటూ వచ్చి పాట పాడేటి ఉప్పునీటి కెరటాలతో కలిపి ఆమె గొంతెత్తి ఎన్నో పాటలు పాడుతూ ఉండేది. ఆ పల్లెవార్ల వేడుకలలో, ఉత్సవాలలో పద్దమ్మ పాడకపోతే అవన్నీ పరిమళాలు లేని పువ్వులులా అయిపోయేవి. అడవి పుష్పాలకు దోహదాలు కావాలా! అందమైన సువాసనలను వెదజల్లడానికి కావలిలో ఆ బాలిక గొంతుకు విని ప్రయివేటు మాష్టరు "ఏమండీ వెంకట్రావు గారు మీ వారికి సంగీతం చెప్పించండి" అని ప్రోత్సహించాడు. అప్పుడే పద్మావతి జీవితములో నరసింహామూర్తి ప్రవేశించాడు.

సముద్రపు ఒడ్డున పాలసముద్రపు కెరటాలలా ఉబికి ఉన్న ఆ ఇసుక తిన్నెలలో ఆటలాడుకొంటూ నత్తగుల్లలు ఏరుతూ, శంఖాలుప్రోగు చేసుకుంటూ, రంగురంగుల పీతల్ని తరుముతూ కూరకుపనికివచ్చే పెద్దపీతజోలికి పోకుండా ఆటలాడుకునే పల్లెబాలికలకు ఆ సముద్రం అవతలి ఒడ్డు ఏమున్నదో ఏమితెలుసు? కెరటాలు ఎందుకు పుడతాయోవాళ్లు ఆలోచిస్తారు. సముద్రపు లోయల్లో ఏ రాక్షసి నిట్టూర్పులు విడుస్తూవుంటే ఆ కెరటాలు ఏర్పడుతాయో, పద్దికి ఏం తెలుస్తుంది! ఊతుకు ఎఱుగని పేలికలైన పరికిణీ చొక్కాలు ధరించి మహారాజు కుమార్తెలా గంతులు వేస్తూ ఆడుకొనే పద్దాలకు, సూర్యోదయాలు, సూర్యాస్తమయాలు సముద్రానికి ఇవతల ఒడ్డు, అవతల ఒడ్డు, సముద్రుని పోటూపాటూ సముద్రుని పెండ్లాము రాకపోక, తోలు బొమ్మల ఆటలులా జరిగిపోయేవి.

ఎందుకు అందమైన ఖట్టలు కట్టుకోవాలో తెలియక పోయినా రంగురంగుల కొత్తపరికిణీ చక్కని చక్కని వల్లె వాటులను, చుక్కచుక్కల రవికెలు కావాలని చిన్నతనం నుంచీ వాంఛించేది పద్దాలు.

పెద్దవాళ్ళయిళ్ళలో తిండికోసము ఏమి వండుకుంటారో అని పద్దాలు ఎప్పుడూ ఊహించుకోనయినా ఊహించుకోలేదు. అనుకుంటే ఇంకా చిక్కటి గంజీ, ఇంకా చిక్కటి కంకటీ, ఇంకా పెద్దవి చేపలు, కోడి మాంసపుకూరలు ఉంటాయి. అంతకన్నా ఏమిటో అని ఎప్పుడైనా అనుకొన్నదేమో! కాని కావలి పట్టణపు బజారు లలో మిరాయి అంగడుల మీద అమ్మే ఆ నోరూరిస్తూ ఘుమఘుమలాడే అవేవో పకోడీలు, కారంపూసా, అవి తన అయ్యపాలి పని చేసే రెడ్డిగారింట్లో తింటారు కాబోలు అని అనుకుండేది.

(సశేషం)

★

**Why was your baby ill ?**

**Be sure you know the root cause of your child being out of sorts. Minor signs of distress which recur after treatment, or which hang on despite it, may mean Liver-disease; and need to be checked by a doctor**

Won't eat — Lethargic — Irritable — Constipation or Diarrhoea — Vomiting — Distended or hot abdomen — Slight fever — Lost weight



JAMMI'S

**Livercure**

for Liver and Spleen disorders
also aids prevention
At all Chemists.

JAMMI VENKATARAMANAYYA & SONS
2, Brodies Road, Mylapore, Madras

SISTA'S-J-260